సాక్షి బాపట్ల

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి గుంటూరు నవభారత్‌నగర్‌కు చెందిన టి.శారద, శ్రీనివాస్‌లు రూ.లక్ష అందించారు.



శాస్త్రీయ సంగీత మహోత్సవాలు

నగరంపాలెం: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని కళావేదికపై రెండు రోజులపాటు జరిగే వాగ్గేయకార శాస్త్రీయ సంగీత మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 43,094 క్యూసెక్కులు వచ్చిచేరుతుంది. దిగువకు 44,222 క్యూసెక్కులు వదులుతున్నారు.

న్యూస్‌రీల్

మద్యం షాపు వద్దే వద్దు

నివాస గృహాల మధ్య వద్దంటూ అడ్డుకున్న మహిళలు



వేటపాలెం: నివాస గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రార్థనా మందిరం, దేవాలయానికి దగ్గరగా మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ బాపట్ల జిల్లా వేటపాలెంలో ప్రజలు శనివారం ఆందోళన చేపట్టారు. చీరాల-వేటపాలెం ప్రధాన రహదారి నుంచి విజయనగర్ కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్నారు. దానికి సమీపంలోనే ప్రభుత్వ హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రంతోపాటు గ్రామ సచివాలయం, ఒక వైపు ఆంజనేయస్వామి దేవస్థానం, మరో వైపు చర్చి ఉన్నాయి. ఈ రోడ్డు ద్వారా విజయనగర్ కాలనీకి నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి చోట మద్యం షాపు ఏర్పాటు చేయాలని చూడటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణం ఎదురుగా నిరసన తెలిపారు. పోలీసులు వచ్చి సర్ది చెప్పారు. మద్యం షాపు తెరిస్తే తిరిగి నిరసన చేపడతామని హెచ్చరించారు.

తహసీల్దార్ కార్యాలయ సందర్శన



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ట్రైనీ ఐఏఎస్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్ సందర్శించారు. శిక్షణలో భాగంగా కార్యాలయానికి వచ్చిన ఆయన అడంగల్, 1-బీ, సర్వే రికార్డులు, ఆర్‌వోఆర్, భూ సంబంధిత రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ శాఖ పనితీరు, సిబ్బంది విధులు తదితరాలను తహసీల్దార్ జి. కరుణకుమార్ వివరించారు. కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

2 నుంచి కార్తిక మాస దీక్షా అభిషేకాలు



మోపిదేవి: కృష్ణాజిల్లా మోపిదేవిలో కొలువైన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు నెల రోజులపాటు దీక్షా అభిషేకాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా నవంబర్ 5వ తేదీ మంగళవారం నాగుల చవితి మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నాగుల చవితికి తెల్లవారు జామున 2.30 గంటలకు ఆలయ ప్రధానార్చకులు, వేదపండితులు నాగపుట్ట వద్ద ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం భక్తులకు నాగపుట్ట దర్శనం ఉంటుంది. మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తారు. నవంబర్ 15వ తేదీ శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో జ్వాలా తోరణం ఏర్పాటు ఉంటుంది. నవంబర్ 29వ తేదీ శుక్రవారం కార్తికమాస శివరాత్రి సందర్భంగా లోకకల్యాణార్థం శ్రీ వల్లీదేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి లక్షబిల్వార్చన అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. లక్ష బిల్వార్చన సందర్భంగా 29, 30 తేదీల్లో స్వామివారికి జరిగే అభిషేకం తాత్కాలికంగా నిలిపి వేయనున్నట్లు ఆలయ డీసీ వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతోనూ, ఆలయం లోపల పూలతో అందంగా అలంకరించారు.

ముగిసిన యువజనోత్సవాలు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా మూడు రోజులపాటు జరిగిన అంతర్ కళాశాలల యువజనోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు ఫోక్, ట్రైబల్ డాన్స్‌లతో విద్యార్థులు అలరించారు. విచిత్ర వేషధారణలతో ఇచ్చిన ప్రదర్శనలు అభినందనలు అందుకున్నాయి. స్కిట్‌కు తగినట్టుగా వేషధారణ, హావభావాలు వహ్వా.. అనిపించేలా సాగాయి. పోటీలలో విద్యార్థుల ప్రదర్శన శెభాష్ అనిపించింది. పాఠ్యపుస్తకాలను వదిలి మూడు రోజులపాటు విద్యార్థులు చేసిన సందడి అంతా ఇంతా కాదు. ప్రదర్శన చేసేవారిని ఉత్సాహపరిచేందుకు సహచర విద్యార్థులు చేసిన సందడి మరింత ఊపునిచ్చింది. రంగోలి, స్పాట్ ఫొటోగ్రఫీ, కార్ట్ బోనింగ్‌లలో కూడా విద్యార్థులు ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చారు.



యాజలిలో ఇసుక భూములు తవ్వి రాశి పోస్తున్న జేసీబీ

పొలాలను తవ్వేస్తున్న ఇసుకాసురులు

- అక్రమ వ్యాపారానికి తెరతీసిన అధికార పార్టీ నాయకులు
- యాజలి రెవెన్యూ పరిధిలో పొక్లెయిన్‌తో ఇసుక భూములు తవ్వకం
- యథేచ్ఛగా తరలిస్తున్న భూ బకాసురులు

కర్లపాలెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో తెలుగుదేశం పార్టీ నాయకులు అక్రమ ఇసుక వ్యాపారానికి తెరలేపారు. యాజలి రెవెన్యూ పరిధిలో సంవత్సరానికి మూడు పంటలు పండే ఇసుక భూములపై భూ బకాసురుల కన్ను పడింది. యాజలి రెవెన్యూ పరిధిలోని యాజలి, దుండివారిపాలెం, బోలాయపాలెం, తిమ్మారెడ్డిపాలెం, దమ్మనవారిపాలెం గ్రామాల పరిధిలో ఇసుక మాగాణి భూములు ఉన్నాయి. ఈ భూములలో రైతులు సంవత్సరానికి మూడు పంటలు వేరుశనగ పండిస్తున్నారు. కొంతమంది రైతులు పచ్చి మిర్చి తోటలతో పాటు కూరగాయ పంటలైన వంకాయ, దొండ, దోస, గోంగూర, తోటకూర, పొట్లకాయలు, కాకరకాయలు వంటి పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నారు. కొందరు ఇసుకాసురులు రైతులను మభ్యపెట్టి భూములు కొనుగోలు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తవ్వి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఇసుక విక్రయిస్తూ ఆర్థికంగా ఆర్జిస్తున్నారు. యాజలి గ్రామంలో రామస్వామి వెంచర్ సమీపంలో ఉన్న ఇసుక భూములను ఎమ్మెల్యే అనుచరుడిని అని చెప్పుకుంటున్న ఓ యువకుడు కొనుగోలు చేసి పొక్లెయిన్ ద్వారా ఇసుక తవ్వి విక్రయిస్తున్నాడు. ఇసుక తవ్వేందుకు అనుమతులు ఉన్నాయా అని అడుగగా రైతుకు డబ్బులిచ్చి కొనుగోలు చేసి ఇసుక తోలుకెళ్లి అమ్ముకుంటున్నానని తెలిపాడు. ఇతని అక్రమ తవ్వకాలు శనివారం మధ్యాహ్నం వెలుగులోకి వచ్చాయి.

పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం...

తహసీల్దార్ సుందరమ్మను వివరణ కోరగా మట్టి తీస్తున్న విషయం తమకు తెలియదని, సిబ్బందిని పంపించి నిలుపుదల చేయిస్తామని చెప్పారు.

మహిళా మార్ట్‌తో మహిళల ఆర్థికాభివృద్ధి

డీఆర్‌డీఏ పీడీ పద్మ

చీరాల టౌన్: పొదుపు మహిళల సహకారంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌తో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని డీఆర్‌డీఏ పీడీ పద్మ అన్నారు. శనివారం చీరాల మండలం ఈపురుపాలెం బైపాస్ రోడ్డు వద్ద ఉన్న మహిళా మార్ట్‌ను పీడీ పరిశీలించారు. మార్ట్‌లో విక్రయిస్తున్న వస్తువులను, వాటి ధరలు, ఆఫర్లతో పాటుగా పొదుపు మహిళలు తయారుచేసిన పలు వస్తువులను పరిశీలించారు. మార్ట్‌లో రోజువారీగా జరుగుతున్న వ్యాపార లావాదేవీలు, రికార్డులను, సిబ్బందికి అందిస్తున్న వేతనాల వివరాలను ఏపీఎం మధుబాబును అడిగి తెలుసుకున్నారు. పీడీ మాట్లాడుతూ పొదుపు మహిళలు తీసుకున్న రుణాలతో తయారుచేసిన వస్తువులను మార్ట్‌లో విక్రయిస్తున్నారని చెప్పారు. మార్ట్ మొత్తం నిర్వహణ పొదుపు మహిళలే చేయడం, నాణ్యత కలిగిన వస్తువులను విక్రయించడం అభినందనీయమన్నారు. పొదుపు మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా తీసుకున్న రుణాల ద్వారా పలు రకాల వస్తువులను తయారుచేసి అమ్మకాలు చేయడం వలన ఆర్థికంగా వృద్ధి సాధిస్తారన్నారు. చేయూత డీపీఎం ప్రమీలారాణి పాల్గొన్నారు.



వస్తువులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ పద్మ

ఎట్టకేలకు విధుల్లో చేరిన
సచివాలయ ఉద్యోగులు

సాక్షి ఎఫెక్ట్

చీరాలటౌన్: కలెక్టర్ బదిలీ ఆర్డర్లు ఇచ్చినా స్థానిక ముఖ్యనేత, అతని వ్యక్తిగత కార్యదర్శి సచివాలయ ఉద్యోగులను విధుల్లో చేర్చుకోకుండా చేసిన ఇబ్బందులు ఎట్టకేలకు తొలగిపోయాయి. సచివాలయాల డిజిటల్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు 45 మందికి గత నెల 22న జిల్లా కలెక్టర్ బదిలీ ఆర్డర్‌లు ఇచ్చారు. అయితే స్థానిక ముఖ్యనేత, అతని కార్యదర్శి అనుమతి కోసం బదిలీ అయిన ఉద్యోగులను వారికి కేటాయించిన సచివాలయాల్లో పోస్టింగుల్లో మండల అధికారులు చేర్చుకోలేదు. ఈ ఉదంతంపై 'సాక్షి' ఈనెల 18న 'బదిలీ ఆర్డర్ ఉన్నా బేఖాతర్' అనే శీర్షిక కథనం ప్రచురించింది. దీంతో మండల స్థాయి అధికారులు, స్థానిక ముఖ్యనేతతో పలుమార్లు చర్చించి ఎట్టకేలకు శుక్ర, శనివారాల్లో బదిలీ అయిన ఉద్యోగులకు వారికి కలెక్టర్ వేసిన ఆర్డర్ ప్రకారం విధుల్లో చేర్చుకున్నారు. 32 రోజులుగా తమకు పోస్టింగులు లేక ఇబ్బందులు పడిన సచివాలయ ఉద్యోగుల సమస్యకు పరిష్కారం కావడంతో 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. వివరాల్లోకెళితే.. గత నెల 22న జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో గ్రామ సచివాలయాల ఉద్యోగులను బదిలీ చేసి రిలీవ్ ఆర్డర్లు, జాయినింగ్ ఆర్డర్లుతో ఈనెల 4 నుంచి మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ 45 మంది సచివాలయాల ఉద్యోగులు తిరుగుతున్నా కనికరం లేకుండా తిప్పుకుంటున్నారే కానీ విధుల్లోకి తీసుకోవడం లేదు. చీరాల మండలంలో 22 గ్రామ సచివాలయాలు, వేటపాలెం మండలంలో 18 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు 15 మంది, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు 15 మంది, డిజిటల్ అసిస్టెంట్లు 15 మందికి కలెక్టర్ బదిలీ ఉత్తర్వులు అందించారు. సచివాలయాల ఉద్యోగులకు టీడీపీ ముఖ్యనేత రిఫరెన్స్ లెటర్, కార్యదర్శి ఆమోదముద్ర తీసుకువస్తేనే విధుల్లో చేర్చుకుంటామని ఆదేశాలిచ్చారు. ఉద్యోగంలో జాయిన్ అవ్వడానికి కలెక్టర్ ఆర్డర్ కంటే ఎమ్మెల్యే రిఫరెన్స్ లెటర్ తీసుకురాడం ఏంటని, రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. దీనిపై సాక్షి కథనాలు ప్రచురించడంతో ఎట్టకేలకు వారికి పోస్టింగు ఆర్డర్లు ఇచ్చి అధికారులు సచివాలయ ఉద్యోగులను జాయిన్ చేసుకోవడంతో కథ సుఖాంతమైంది.



బదిలీ ఆర్డరున్నా బేఖాతర్!

చీరాల ఎంపీడీవో కార్యాలయం

సాక్షిలో ప్రచురితమైన సచివాలయ ఉద్యోగులపై కథనం

నేటి నుంచి ఐదు జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఐదు జిన్నింగ్ మిల్లులను పత్తి కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసినట్లు మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకుడు బి.రాజబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటేశ్వర కాటన్ జిన్నింగ్ మిల్(అంకిరెడ్డిపాలెం), శ్రీ సోమేశ్వర ట్రేడింగ్ కంపెనీ (పుల్లడిగుంట), శ్రీసాయి ట్రేడర్స్ (ప్రత్తిపాడు), శ్రీవిజయ వెంకటేశ్వర కాటన్ జిన్నింగ్ మిల్ (మేడికొండూరు), తాడికొండ పరిధిలోని శివసాయి టీఎంసీ (కోయవారిపాలెం) జిన్నింగ్ మిల్లులు నోటిఫై అయినట్లు పేర్కొన్నారు. ఆదివారం నుంచి పత్తి రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే)లో తమ పేర్లు నమోదు చేయించుకుని దగ్గరలోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తిని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ.7,521కు విక్రయించుకోవచ్చని సూచించారు.

రూ.34 లక్షలు టోకరా

- పెట్రోలు బంకు యజమానులను మోసగించిన దంపతులు
- ఇరువురిపై కేసు నమోదు

అద్దంకి రూరల్: నమ్మి ఉద్యోగమిచ్చిన యజమానులకే టోకరా వేశారు దంపతులు. విదేశాల్లో వ్యాపారం చేసుకుంటూ నమ్మకస్తులని భార్యాభర్తలను నమ్మి పెట్రోలు బంకు మేనేజర్లుగా నియమిస్తే యజమానులకే రూ.34 లక్షలు టోకరా పెట్టిన దంపతులపై శనివారం సీఐ కృష్ణయ్య కేసు నమోదు చేశారు. సీఐ వివరాల మేరకు.. గుంటూరు దేవపురానికి చెందిన జెల్డి అనిల్‌కుమార్, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా సింగరేణికి చెందిన గార్లపాటి రంజిత్‌కుమార్‌లు దక్షిణాఫ్రికాలో వ్యాపారాలు నిర్వహిస్తుంటారు. వీరిద్దరూ కలిసి అద్దంకిలోని గరటయ్య కాలనీ ఎదురుగా మూడేళ్ల కిందట గార్లపాటి పెట్రోలియమ్స్ పేరుతో పెట్రోలు బంకు ఏర్పాటు చేశారు. దీనికి మేనేజర్లుగా తమకు పరిచయం ఉన్న ప్రకాశం జిల్లా చీమకుర్తి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన బత్తుల వెంకటేశ్వర్లు, అతని భార్య మల్లేశ్వరిలను నమ్మి ఇరువురికి నెలకు రూ.8 వేల చొప్పున జీతమిస్తూ మేనేజర్లుగా నియమించి దక్షిణాఫ్రికాకు వెళ్లారు. యజమానులు సంవత్సరానికి ఒకసారి వచ్చి పెట్రోలు బంకును సందర్శించి వ్యాపార లావాదేవిలు, లెక్కలు చూసుకొని వెళ్తుండేవారు. ఈ నేపథ్యంలో యజమానులు ఇక్కడ లేకపోవడంతో దంపతులు మూడు నెలలుగా పెట్రోలు, డీజిల్ అమ్మగా వచ్చిన డబ్బులను యజమాని ఖాతాకు జమ చేయకుండా కస్టమర్ల నుంచి ఫోన్‌పే ద్వారా తమ ఖాతాలకు మళ్లించుకున్నారు. గత నెలలో యజమాని గార్లపాటి రంజిత్ కుమార్ ఇండియాకు వచ్చారు. అద్దంకి వచ్చి లెక్కలు చూసుకునేందుకు పెట్రోలు బంకుకు రాగా మేనేజర్లు లేకపోవటంతో అనుమానంతో విచారించారు. తమను మోసగించి రూ.30 లక్షల మేర సొంతానికి వాడుకున్నారని గ్రహించారు. ఇదే కాకుండా తనకు బ్యాంకులో రుణం ఉందని అది విడిపించటానికి గతంలో రూ.4 లక్షలు కావాలని అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. వారి ఇంటికి వెళ్లి గట్టిగా నిలదీయటంతో తమ వద్ద ఏమీ లేవని, నీ ఇష్టం వచ్చింది చేసుకోమని బెదిరించి దాడికి పాల్పడ్డారు. దీంతో యజమానులు అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సాంకేతిక ఉపకరణాలపై విద్యార్థులకు అవగాహన

బాపట్ల : ఓపెన్ హౌస్ లాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ చేపట్టిన కార్యక్రమంలో విద్యార్థులకు పోలీసులు ఉపయోగించే పరికరాలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. విధి నిర్వహణలో పోలీసులు వినియోగించే పరికరాలు, సాధనాలు, సాంకేతిక ఉపకరణాల గురించి విద్యార్థులకు అడిషనల్ ఎస్పీ వివరించారు. ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని వీక్షించడానికి బాపట్ల జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పోలీస్ అధికారుల ర్యాంకులు, వారి విధుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఎస్బీ సీఐ నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు డ్రోన్ గురించి వివరిస్తున్న అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన

చీరాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను ఆపివేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మిలు మాట్లాడుతూ ప్రజలకు మూడు నెలలకే రాష్ట్ర ప్రభుత్వం మోత మోగించిందన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమంటూ ప్రకటించిన టీడీపీ కూటమి రూ.6,072 కోట్లు భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. టీడీపీ కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలో హామీని తుంగలో తొక్కి 44 శాతం పెంచడం దారుణమన్నారు. మాట తప్పి ప్రజలపై వేసిన చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. పెంచిన చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, పట్టణ కార్యదర్శి ఎం.వసంతరావు, నాయకులు సత్యమూర్తి, యేసురత్నం, చింత శ్రీనివాసరావు, కె.జైకుమార్, సిరిపురం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సొంత వైద్యం ఎంతో చేటు!

- వైద్యుల సలహాలు లేకుండానే ఔషధాల వినియోగం
- కరోనా తరువాత మారిన సామాన్యుల ధోరణి
- విశ్రాంతి తీసుకుంటే చిన్న రోగాలు త్వరగా నయం
- ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల దుకాణాల్లో విక్రయాలు

గుంటూరు మెడికల్ : గుంటూరు శ్రీనగర్‌కు చెందిన లక్ష్మయ్య ఆటో డ్రైవర్. తరచూ తల, మోకాలి నొప్పులు వస్తూ ఉండటంతో మందుల షాపునకు వెళ్లి ఔషధాలు మింగుతున్నాడు. దీర్ఘకాలంగా వైద్యుల సలహాలు లేకుండా ఇలా వాడటం వల్ల కిడ్నీలు దెబ్బతిని ఆస్పత్రి పాలయ్యాడు.

గురజాలకు చెందిన జానకి పొలం పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. అప్పుడప్పుడు జ్వరం, వాంతులు, కొద్దిపాటి ఒళ్లు, కాళ్ల నొప్పులు వచ్చేవి. ఇంటికి సమీపంలోని మందుల షాపులో యాంటీ బయాటిక్స్ మందులు కొనుక్కుని మింగుతోంది. దీర్ఘకాలికంగా ఇలా వాడటం వల్ల ఆరోగ్యం విషమించి గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వారం రోజులు ఐసీయూలో చికిత్స పొందితే ప్రాణాపాయ స్థితి నుండి బయట పడింది.

అనర్హులతో మందుల విక్రయాలు....

జబ్బు తగ్గాలంటే వైద్యుడి వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకుని వారి సలహా మేరకు మందులు వాడాలి. కరోనా నాటి నుంచి ప్రజలు మెడికల్ షాపులనే ఆశ్రయిస్తున్నారు. చాలా షాపుల్లో అర్హత కలిగిన ఫార్మాసిస్టులు లేరు. తెలిసీతెలియని పరిజ్ఞానంతో వారు అడ్డగోలుగా మందులు ఇస్తున్నారు. కొన్నిసార్లు వారిచ్చిన డోసు అధికం కావడం, మరికొందరికి ఆ మందులు పడకపోవడం, వంటి కారణాలతో అనారోగ్యం పెరుగుతోంది. గుంటూరు జిల్లాలో 2,200, పల్నాడు జిల్లాలో 1,200 మెడికల్ షాపులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 1,800కు పైగా హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. కరోనా సమయంలో లూజు కౌంటర్ విక్రయాలు ఎక్కువ జరిగాయి. ఇప్పటికే ఇదే తరహాలో విక్రయాలు కొనసాగుతున్నాయి. కొన్ని మందులను వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా రోగికి ఇవ్వకూడదు. కానీ చాలా మెడికల్ షాపుల్లో ఇవేమీ పట్టించుకోవడం లేదు. కనీసం ఫార్మాసిస్టు లేకుండానే నేరుగా మందులు విక్రయిస్తున్నారు.



ఆస్పత్రి ఖర్చు భరించలేకే....

ప్రస్తుత పరిస్థితుల్లో ఒంట్లో ఏదైనా నలత ఏర్పడితే ఆ వ్యాధి కంటే దాని కయ్యే ఖర్చుకే రోగి భయపడుతున్నాడు. వ్యాధి లక్షణాలను బట్టి మందులు ఇచ్చే వైద్యుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశాకే చికిత్స కొనసాగుతోంది. సాధారణ జలుబు, దగ్గు, జ్వరంతో వెళ్లినా ఇదే పరిస్థితి నెలకొంది. కొంతమంది వైద్యుల ఓపీ ఫీజులే రూ.1000 నుంచి రూ. 1200 వరకు ఉంటున్నాయి. దీనికితోడు వైద్యుడు రాసే వివిధ పరీక్షలు చేయించుకుంటే ఖర్చు దాదాపు రూ. 5 వేల నుంచి రూ. పది వేల వరకు అవుతోంది. దీన్ని సాధారణ ప్రజలు భరించలేకే వైద్యుడి కంటే నేరుగా మందుల షాపులకు వెళుతున్నారు.

యాంటీ బయాటిక్స్‌తో చేటు....

సాధారణ జలుబు, దగ్గు, జ్వరం, నొప్పుల వరకు ఇలా మందులు ఇచ్చినా ఏమో అనుకోవచ్చు గానీ... కొన్నిసార్లు యాంటీ బయాటిక్స్, తీవ్రమైన స్టెరాయిడ్స్, నొప్పుల మాత్రలు రోగులకు విక్రయిస్తున్నారు. కొన్ని దుకాణాల్లో మత్తు కలిగించే మందులు, ఇంజెక్షన్లు కూడా వాటికి బానిసైన వారికి విక్రయిస్తున్నారు. దగ్గు సిరప్‌ను అధిక శాతం విక్రయించే దుకాణాలు సైతం నగరంలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని మందుల షాపుల్లో పరిస్థితి చెప్పనవసరం లేదు. అధిక ధరలకు ఇలాంటివి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీర్ఘకాలిక జబ్బులున్నవారు మెడికల్ షాపులనే ఆశ్రయిస్తున్నారు. లైంగిక ఉత్ప్రేరకాలు అతిగా వాడితే గుండె, కిడ్నీలపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. పెయిన్ కిల్లర్స్, స్టెరాయిడ్స్ వాడితే కడుపులో పుండ్లు, కాలేయ, కిడ్నీ సమస్యలకు ఆస్కారం ఉంది. పీరియడ్స్ విషయంలో మందులు సైతం వైద్యుల సూచన లేకుండా వాడకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తే చర్యలు



వైద్యుల సూచన మేరకు మాత్రమే ప్రతి ఒక్కరూ మందులు విక్రయించాలి. నేరుగా మందులు కొని వాడితే కొన్నిసార్లు సైడ్ ఎఫెక్ట్ వల్ల ప్రాణం మీదకు వచ్చే అవకాశం ఉంది. షాపుల వారు వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించడం నేరం. ఆ దుకాణాలలో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం. దుకాణదారుడు విక్రయాల బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలి. ఎవరికి విక్రయించారో బిల్లు బుక్‌లో లేదా ఆన్‌లైన్‌లో చూపించాలి.

– డి.లక్ష్మణ్, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ, పరిపాలన శాఖ కార్యాలయం, గుంటూరు

నొప్పుల మాత్రలతో కిడ్నీలకు ప్రమాదం



వైద్యుల సలహాలు లేకుండా రోగులు సొంతంగా రోజూ నొప్పుల మాత్రలు, స్టెరాయిడ్స్ కొని వాడితే ఇబ్బందులు తప్పవు. కడుపులో అల్సర్లు ఏర్పడమే కాకుండా కిడ్నీలు కూడా ఫెయిలవుతాయి. ప్రతి మందుకూ సైడ్ ఎఫెక్ట్ ఉంటుంది. ఏ మందు ఎవరికి పనిచేస్తుందో వైద్యులకు మాత్రమే తెలుస్తుంది.

– డాక్టర్ చింతా రామకృష్ణ, నెఫ్రాలజిస్టు, గుంటూరు

త్వరలో క్రీడా పాలసీల ప్రకటన

శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

తెనాలి: క్రీడాకారుల భవిష్యత్తుపై రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ వహిస్తుందని, వారికి ప్రయోజనకరంగా ఉండేలా త్వరలో పాలసీలను ప్రకటించనున్నట్టు ఏపీ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు చెప్పారు. స్థానిక మున్సిపల్ స్టేడియం మైదానంలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంతర జిల్లాల అండర్-14 బాలుర, బాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌ను శనివారం రవినాయుడు, లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (లిడ్‌కాప్) ఛైర్మన్ మాణిక్యాలరావులు కలిసి క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. తొలుత 13 ఉమ్మడి జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ చేశారు. రవినాయుడు మాట్లాడుతూ క్రీడాకారులకు సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. నియోజకవర్గాల్లో కేవీకేలు, ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలు, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాల నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. అంతర్జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేస్తామన్నారు. ఇందులో భాగంగా పీపీపీ విధానం, సీఎస్ఆర్ ఫండ్స్ సేకరణకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. లిడ్‌కాప్ ఛైర్మన్ పి.మాణిక్యాలరావు మాట్లాడుతూ క్రీడారంగం విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. డీవైఈవో శాంతకుమారి, డీఎస్డీఓ నర్సింహారెడ్డి, కమిషనర్ బండి శేషన్న పాల్గొన్నారు.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న రవినాయుడు, మాణిక్యాలరావు

క్లుప్తంగా

మెరుగైన వైద్య సేవల బాధ్యత ఏఎన్ఎంలదే



నగరం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాల్సిన బాధ్యత ఏఎన్ఎంలదేనని ఆరోగ్యశాఖ జిల్లా గణాంకాధికారి డాక్టర్ పి.వేణు చెప్పారు. మండలంలోని పెద్దవరం, బొరమాదిగపల్లి ఆరోగ్య ఉపకేంద్రాలను శనివారం జిల్లా వైద్యారోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ టీం పరిశీలించింది. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ.. గ్రామాలలో వైద్య సిబ్బంది సేవల తీరును తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల పని తీరుపై గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించినట్లు చెప్పారు. రిజిస్టర్‌లను పరిశీలించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు సీహెచ్ మల్లికార్జునరావు, లక్ష్మణ్, చిన మట్టపూడి, ధూళిపూడి పీహెచ్‌సీల డాక్టర్‌లు మంజూష, నజీలాపర్వీన్, సీహెచ్‌వో బాబురావు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు దరఖాస్తులు ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: బాలల సంరక్షణ కేంద్రాలను నడుపుతున్న సంస్థలు, వ్యక్తులు తప్పనిసరిగా జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టం అనుసరించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని బాలల సంక్షేమం, సంస్కరణ సేవలు, వీధి బాలల సంక్షేమశాఖ పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ పర్యవేక్షణాధికారి బి.ఎ.సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు వ్యక్తులు లేదా సంస్థల నిర్వాహకులు గతంలో ఏదైనా చట్టానికి లోబడి లైసెన్స్ తీసుకున్నప్పటికీ జువెనైల్ జస్టిస్–2015 సెక్షన్ 41 కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈమేరకు రాష్ట్ర బాలల సంక్షేమం, సంస్కరణల సేవల శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు. ఆయా కేంద్రాల నిర్వాహకులు లేదా వ్యక్తులు దరఖాస్తు చేసుకునేందుకు కావలసిన పత్రాలను htpp:wdcw.ap.gov.in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను స్పీడ్ పోస్ట్ లేదా రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపాలని తెలిపారు. వివరాలకు బి.ఎ.సత్యనారాయణ 9100045422, డి.శౌరిరాజు జిల్లా బాలల సంరక్షణ అధికారిని 9491893673 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఉమ్మడి గుంటూరు స్విమ్మింగ్ జట్ల ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్ వద్ద ఉమ్మడి గుంటూరు జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా జట్లుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎన్.సురేష్‌కుమార్ ప్రకటించారు. అండర్–14 బాలుర విభాగంలో కె.సంజీవన్‌సాయి, బి.నాగచైతన్య, ఆర్.లోహిత్, బి.సాయిదీపక్‌రెడ్డి, బి.అర్జున్‌రెడ్డి, వై.గౌహర్, కెఎస్ఎస్ రుత్విక్, ఏ.పవనాంజనేయులు, షేక్.సాధిక్, బాలికల విభాగంలో షేక్.షాజ్మిన్ జెస్రహ్, ఎం.చరణ్యరెడ్డి ఎంపికయ్యారు. అండర్–17 బాలుర విభాగంలో సిహెచ్.రేవంత్ సాయిరెడ్డి, పి.రామ్‌ధ్యాన్‌చంద్, ఎస్.ధీరజ్, బి.హర్షవర్ధన్‌రాజు, యు.శశికుమార్, బి.రాజశేఖర్ ఎంపికయ్యారు.

పల్లె నిద్రతో నేరాల నియంత్రణ

రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు



భట్టిప్రోలులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

భట్టిప్రోలు: జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశానుసారం భట్టిప్రోలులో శుక్రవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం వద్ద రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలు, వివాదాలు, నేరాలు, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పల్లె నిద్రతో నేరాలను నియంత్రించవచ్చునని అన్నారు. నేర సంబంధిత సమాచారం తెలిస్తే పోలీస్ అధికారులకు లేదా 100, 112 నెంబర్లకు కాల్ చేసి చెప్పాలని సూచించారు. గంజాయి, మద్యం రవాణా, క్రయ విక్రయాలకు పాల్పడితే నూతన చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాత్రి బస చేశారు. కార్యక్రమంలో వేమూరు సీఐ పి.ఆంజనేయులు, ఎస్ఐ ఎం.శివయ్య, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వేటపాలెం విద్యార్థులు





ఎంపికైన విద్యార్థులతో ఆయా పాఠశాలల ప్రతినిధులు

వేటపాలెం: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వివిధ పాఠశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వి. చందన అండర్–17 విభాగంలో పరుగు పందెంలో, ఎనిమిదో తరగతి చదువుతున్న ఎల్. వైష్ణవి లాంగ్‌జంప్‌లో, పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి అండర్ 17 బాలుర విభాగంలో ఎస్.కార్తీక్ హైజంప్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబర్‌లో విజయనగరంలో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయని తెలపారు. విద్యార్థులను శనివారం హెచ్ఎంలు పి. ఫణికుమార్, నారాయణ స్వామి, పీడీ శ్రావణి, ఎ. కోటేశ్వరమ్మ, కర్ణ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాజ్యాంగాన్ని దళితులు రక్షించుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో దళిత నాయకులు

చీరాల రూరల్: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు మందకృష్ణ వక్రభాష్యం ద్వారా రాజ్యాంగం సంక్షోభంలో పడనుందని.. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని రాజ్యాంగ పరిరక్షణ కమిటీ, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో కోటి ఆనంద్ అధ్యక్షతన 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం రండి' పై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ విన్సెంట్ పాల్, నిరీక్షణ పాల్‌లు మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు గురించి కొందరు అవగాహన లేకుండా మాట్లాడుతూ పబ్బం గడుపుకొంటున్నారని చెప్పారు. ఈ తీర్పుతో మందకృష్ణ తన సొంత సామాజిక వర్గం వారితో విమర్శలు ఎదుర్కోవాల్సిన దుస్థితిలో ఉన్నారని చెప్పారు. కొంతమంది ప్రోద్బలంతో అంబేడ్కర్‌పై అసంబద్ధమైన వ్యాఖ్యలు చేస్తూ ఒక కులానికి మాత్రమే పరిమితం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మాదిగలకు వచ్చే ఉద్యోగాలు మాలలు దోచుకుంటున్నారని ప్రతిసారి సభలు, సమావేశాల్లో మందకృష్ణ మాట్లాడడం సరికాదని చెప్పారు. ఇప్పటికైనా మాదిగలు నిజాలు గుర్తించి మందకృష్ణ మాయ మాటలు నమ్మవద్దని హితవు పలికారు. సమావేశంలో లింగం జయరాజు, బి. సుధాకర్, యేసేపు, కిషోర్, ఆదివాసీ సంక్షేమ సంఘం కార్యదర్శి కె. సురేష్, గొర్రెముచ్చు ప్రేమ్‌కుమార్, డేవిడ్, బాలరాజు, కొప్పోలు శౌరి, కంచర్ల రోశయ్య, జిలాని, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయానికి బదులు ఆత్మహత్యలు రెట్టింపు

- తీవ్ర సంక్షోభంలో వ్యవసాయ రంగం
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య

నరసరావుపేట: దేశం, రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో ఉందని, రైతుల ఆదాయానికి బదులుగా ఆత్మహత్యలు రెట్టింపు అయ్యాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య పేర్కొన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కోటప్పకొండ రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో శనివారం పార్టీ నరసరావుపేట మండల సర్వసభ్య సమావేశం జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి అధ్యక్షతన నిర్వహించారు. దీనికి హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ పాలకుల విధానాలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారి ఏడాదికి రూ.2.50 లక్షల కోట్ల ఆదాయాన్ని పారిశ్రామిక వేత్తలకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. రానురాను వ్యవసాయ ఉత్పత్తులు తగ్గిపోతున్నాయని, కార్మిక రంగం అన్ని విధాల వెనుకబడటమే దీనికి నిదర్శనమని అన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, చదువుతున్న యువత ఉద్యోగాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నవంబర్ 26న దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో రైతులు, కౌలు రైతులు, కార్మికులతో కలిసి అన్ని కలెక్టరేట్ కార్యాలయాల వద్ద చేపట్టనున్న ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ పెరిగిన ధరలకు వ్యతిరేకంగా వచ్చే నెల 8 నుంచి 15వ తేదీ వరకు వాడ వాడల పార్టీ నాయకులు, కార్యకర్తలు పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. అనంతరం నరసరావుపేట పార్టీ మండల కమిటీ కన్వీనర్‌గా డి.శివకుమారి, సభ్యులుగా షేక్ సిలార్ మసూద్, మేడం ఆంజనేయులు, షేక్ రబ్బాని, కొమ్ముల నాగేశ్వరరావు, టి.పెద్దిరాజులను ఎన్నుకున్నారు. సీనియర్ నాయకులు ఏవీకే దుర్గారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.ఆంజనేయ నాయక్, నాయకులు కేపీ మెటిల్డా దేవి, కామినేని రామారావు, కోండ్రు ఆంజనేయులు, ఈపూరి మస్తాన్ రెడ్డి, బీరెడ్డి పుల్లారెడ్డి పాల్గొన్నారు.

పీఎం స్వనిధి రుణాలలో జీఎంసీకి జాతీయ అవార్డు

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వ పీఎం స్వనిధి (ప్రధాన మంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధి) ద్వారా రుణాలు అందించినందుకు జాతీయ స్థాయిలో గుంటూరు నగరపాలక సంస్థకు అవార్డు దక్కింది. జీఎంసీ పరిధిలో 24,197 అప్లికేషన్‌లకుగాను బ్యాంక్‌ల ద్వారా 21,594 మంది చిరు వ్యాపారులకు రుణాలు అందించారు. తద్వారా కార్పొరేషన్‌లకు సంబంధించి జీఎంసీ తొలి స్థానంలో నిలిచిందని, దీనికి కృషి చేసిన మెప్మా సిబ్బందికి నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అభినందనలు తెలిపారు. ఈ నెల 29న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే అభినందన కార్యక్రమంలో ఈ అవార్డ్ ప్రదానం చేయనున్నారని పేర్కొన్నారు.

ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ లిస్టు శనివారం విడుదలైంది. పబ్లిక్ హెల్త్ వర్కర్, స్వీపర్, గ్యాంగ్ మజ్దూర్, డ్రెయిన్ క్లీనర్, కళాసీ, పోల్టెన్ సర్వెంట్ వంటి 20 పోస్టుల భర్తీకి సంబంధించి ఆగస్టు 6 నుంచి 13వ తేదీ వరకు సామర్థ్య పరీక్ష నిర్వహించారు. దీనికి సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గుంటూరు ఏపీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ మేరకు జిల్లా సెలక్షన్ కమిటీ సభ్యులు వెల్లడించారు.

లలిత హాస్పిటల్స్‌కు డైమండ్ అవార్డు



గుంటూరు మెడికల్: వరల్డ్ స్ట్రోక్ కాంగ్రెస్‌లో గుంటూరుకు చెందిన లలిత సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్స్ వరుసగా నాలుగో ఏడాది డైమండ్ అవార్డును సాధించింది. ఈ విషయాన్ని శనివారం హాస్పిటల్స్ సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ మీడియాకు వెల్లడించారు. అంకిసీడు స్ట్రోక్ యూనిట్ ద్వారా పక్షవాతం రోగులకు ఉత్తమ చికిత్స అందించడంలో ప్రతిష్టాత్మక అవార్డును వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ అందజేసినట్లు లలిత గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి. రాఘవ శర్మ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కొన్ని స్ట్రోక్ కేంద్రాల్లో తమ కేంద్రం ఒకటన్నారు. డాక్టర్ విజయ అబుదాబిలోని క్లీవ్యాండ్ క్లినిక్‌ను సందర్శించి, అక్కడి న్యూరో సైంటిస్టులతో అత్యాధునిక సాంకేతికత గురించి చర్చించారు. అక్టోబర్ 23 నుంచి 26వ తేదీ వరకు అబుదాబీలో జరిగిన 16వ వరల్డ్ స్ట్రోక్ కాంగ్రెస్ 2024లో ఆమె పాల్గొన్నారు. రికరెంట్ బ్రెయిన్ స్ట్రోక్‌లకు గల కారణాలపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. పరిశోధనలో 25శాతం మందికి రెండవ లేదా మూడవ సారి పక్షవాతం సంభవిస్తున్నట్లు గమనించారు. దీనికి ప్రధాన కారణం జీవితాంతం తీసుకోవాల్సిన యాంటి థ్రాంబోటిక్ ఔషధాలను మానివేయడమే అని డాక్టర్ విజయ తెలిపారు. ధూమపానం, మద్యం మానలేకపోవడం, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించక పోవడం మూడవ ప్రధాన కారణమని పేర్కొన్నారు.

ముగిసిన ఎన్ఐఆర్ఎఫ్ నిపుణుల కమిటీ పర్యటన



కమిటీ సభ్యులతో వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎన్ఐఆర్ఎఫ్ నిపుణుల కమిటీ పర్యటన శనివారంతో ముగిసింది. కమిటీ సభ్యులు ఐక్యూఏసీ, లైబ్రరీ, హెర్బల్ గార్డెన్, బొటానికల్ గార్డెన్, ఇంక్యుబేషన్ సెంటర్, వెజిటేబుల్ గార్డెన్‌లను సందర్శించారు. లైబ్రరీలో ఆన్‌లైన్ జర్నల్స్ పరిశోధకులకు ఏ విధంగా అనుమతి ఇస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఐక్యూఏసీ, నాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు పొందేందుకు ఇచ్చిన నివేదికలను పరిశీలించారు. వాటి ఆధారంగా వర్సిటీ అధికారులకు పలు సూచనలు చేశారు. జాతీయ, అంతర్జాతీయ పరిశోధన ప్రాజెక్టులు పొందాలని, ఆ అవకాశాలు రెట్టింపు చేసుకోవాలన్నారు. అధ్యాపకులు పరిశోధకులతో ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనల వైపు అడుగులు వేయాలని సూచించారు. శాస్త్ర సాంకేతిక రంగాల వైపు విద్యార్థులను నడిపేలా దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను ఎప్పటికప్పుడు వివరించాలని పేర్కొన్నారు. అనంతరం ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె. గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణసత్య, ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ డాక్టర్ గోపీకృష్ణ , డాక్టర్ చంద్రమౌళి, ర్యాంకుల విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.రవి తదితరులతో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు.

దిగుబడులు పెంపునకు సమష్టి కృషి



మాట్లాడుతున్న డాక్టర్ శివన్నారాయణ

గుంటూరు రూరల్: లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమగ్ర పోషక యాజమాన్యం 15 రోజుల సర్టిఫికెట్ కోర్స్ శిక్షణ తరగతులు శనివారం కొనసాగాయి. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఎం. శివన్నారాయణ మాట్లాడుతూ.. తరగతుల్లో పాల్గొన్న ప్రతి పీఏసీఎస్ సంఘం ప్రతినిధి రైతులకు దిగుబడులను పెంచే అంశాలను తెలుసుకోవాలన్నారు. మేలైన దిగుబడులను ప్రతి పంటలో పొందేలా తోడ్పడాలని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎస్‌వీఎస్ దుర్గాప్రసాద్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రవీంద్రరెడ్డి, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వెంకటలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. వెంకటరాములు, ప్రాథమిక సహకార సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సందర్శన కార్యక్రమం

గుంటూరు రూరల్: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫాం నందు శనివారం అక్టోబర్ నెల శిక్షణ, సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. లాంఫాం ఏడీఆర్ డాక్టర్ ఎస్‌వీఎస్ దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎస్ శివన్నారాయణ, డీఏవోలు నున్న వెంకటేశ్వర్లు, మురళిలు పలు అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఏడీఏలు, డీఆర్‌సీ సిబ్బంది, శాస్త్రవేత్తలు, డాట్ సెంటర్, కేవీకే శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

జనవరి 5న హైందవ ధర్మ శంఖారావం

తాళ్ళాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శివస్వామి



తాళ్ళాయపాలెం(తాడికొండ): విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో వచ్చే జనవరి 5వ తేదీన హైందవ ధర్మ శంఖారావం నిర్వహించనున్నట్లు తాళ్ళాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శివస్వామి వెల్లడించారు. శనివారం తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం శైవక్షేత్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జాతీయ స్థాయిలో చైతన్యం పెంచుతూ ప్రథమంగా విజయవాడ కేంద్రంగా ఈ శంఖారావం నిర్వహించడం హర్షణీయమన్నారు. దేశ వ్యాప్తంగా దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్న దేవాలయాలను విముక్తి కలుగజేసి ఇతర మతాల తరహాలో స్వేచ్ఛగా కార్యకలాపాలు సాగాలని చెప్పడమేనన్నారు. విశ్వ జన పరిరక్షణ వేదిక, సాధు పరివార్, హిందూ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో మఠ, పీఠ, ఆశ్రమాల సమావేశాన్ని శైవక్షేత్రం వేదికగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విశ్వజన పరిరక్షణ వేదిక రెండు తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు ఆత్మానంద భారతీ, విశ్వస్వామి, అష్టాజియర్ స్వామి, రాధా మనోహర్ దాస్ స్వామి, సాధుపరివార్ అధ్యక్షులు శ్రీనివాసానందస్వామి, చాముండేశ్వరి మహర్షి, దండిస్వామి, భవానీ స్వామి, నిరంజన్ దాస్ స్వామి తదితరులు పాల్గొని.. ఒకే నినాదం ఒకే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఏపీలో ఉన్న ప్రతి గ్రామం, జిల్లాలో సమావేశాలు ఏర్పాటు చేసి లక్షలాది మంది ప్రజలతో హైందవ ధర్మ శంఖారావాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

ఏసీఏ అండర్–19 రెండో మ్యాచ్ ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఏసీఏ అండర్–19 రాష్ట్ర జట్టు ఎంపిక మ్యాచ్‌ల్లో భాగంగా శనివారం గ్రూప్–ఏ, గ్రూప్–సి జట్లు మధ్య రెండవ మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గ్రూప్–ఏ జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 59.5 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని జి.వి.చరణ్‌జిత్ 48, పరమ్‌వీర్‌సింగ్ 48, జి.ఈశ్వర్ రిత్విక్ 46 పరుగులు సాధించారు. గ్రూప్–సి బౌలర్ ఎస్.భార్గవ్‌మహేష్ 15.5 ఓవర్లు వేసి 50 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గ్రూప్–సి జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్లు నష్టానికి 88 పరుగులు సాధించింది. జట్టులోని బి.మధుసూదన్ 43 పరుగులు సాధించాడు. గ్రూప్–ఏ బౌలర్ ఎస్.రాజేష్‌కు 2 వికెట్లు లభించాయి. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.